

# రాజీ

వేదగిరి రాంబాబు

ఉదయంనించీ ఒకటే వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది రోడ్లన్నీ నీళ్ళతో నిండిపోయాయ్

భవాని కిటికీ దగ్గర కూర్చుని ఇంటి బయట ప్రవహిస్తున్న వర్షపు నీటిని చిన్నపిల్లలా మైమరచి చూస్తోంది ఇప్పుడేకాదు చిన్నప్పట్నించీ కూడా అదే కిటికీ దగ్గర కూర్చుని ధారగా కురు

స్తున్న వర్షం చూడడమంటే ఇష్టం భవానికి. ఎందుకో తెలీదు. ఈ విషయం చెప్పినప్పుడల్లా తన స్నేహితురాలు ఇందిర ఆశ్చర్యపోతూండేది.

"అదేమిటి? వర్షం అంటే ఇష్టపడే దాన్ని నిన్నొక్కర్తెనే చూశాను"అనేది ఆశ్చర్యంగా చూస్తూ. నిజానికి దానికి మాత్రం వర్షమంటే చెడ్డ చిరాకు.

కొద్దిపాటి వర్షం కురిసినా "అబ్బ! పాడువాన! ప్రాణం తీసేస్తోంది!" ఒకటికి పదిసార్లు విసుక్కొంటుండేది.

భవాని ఆలోచనలన్నీ ఇందిర మీదకి మళ్ళాయ్—

సరిగ్గా నాలుగేళ్ళయింది దానికి పెళ్లై. భర్తతో వైజాగ్‌లో వుంటోందిప్పుడు. అప్పుడప్పుడూ తనకి ఉత్తరాలు వ్రాస్తూనే వుండేది. ఆమె రెండోసారి గర్భవతిగా వున్నప్పు డాఖరి వుత్తరం రాసింది.అంతే! ఆ తరవాత ఉత్తరంలేదు. బహుశా ఈపాటికి ఏ పాపనో,బాబునో కని,చూసుకొని మురిసిపోతూంటుంది. నిరాశగా నవ్వుకొంది భవాని.

తనకుకూడా నాలుగేళ్ళ క్రితమే వివాహమైవుంటే తనూ ఇద్దరు పిల్లల తల్లి అయ్యేది. తనూ ఓ ముద్దుల పాపనెత్తుకొని ముద్దాడుతుండేది. ఎంచేతో తెలీదుగాని తనకి చిన్న పాపాయిలంటే ఎంతో ఇష్టం. కనబడ్డ పాపాయినల్లా వదలకుండా ముద్దాడుతుంటే బంధువులంతా "నీకూ ఓరోజు పాపాయి పుడుతుందిలే!" అంటూ పరిహాసించేవాళ్ళు. పైకి వాళ్ళలా అన్నందుకు బుంగమూతి పెట్టినా—లోలోపల ఆ మాటలు ఆనందాన్నే కలిగించేవి. నిజంగానే ఓ పాపని కని తన కోరిక తీర్చుకొనే రోజెప్పుడు వస్తుందో అని కలలు కనేది.

కానీ, తను దురదృష్టవంతురాలు. అంచేతే తన చదువూ ఆగిపోయింది. తనకు వేలకి వేలు పోసి వివాహంచేసే స్తోమత తల్లిదండ్రులకు లేకపోవడంతో పెళ్ళి కాలేదు. ధ్యేయంలేని జీవితం గడుపుతున్నట్లనిపిస్తోంది తనకి.

వర్షం తగ్గింది. సన్నని తుంపర పడుతోందంతే.

రోడ్డుమీద మళ్ళీ రాకపోకలు మొదలైనై. పిల్లలు కొంతమంది ఇంటి ముందు నిలిచిన మోకాటిలోతు నీళ్ళల్లో ఉత్సాహంగా అరుస్తూ గెంతుతున్నారు.

ఆ నీళ్ళలోనే నెమ్మదిగా వచ్చి మెట్ల ముందాగిన రిక్షాని ఆశ్చర్యంగా చూసింది భవాని.

ఈ వర్షంలో తమింటికి వచ్చేదెవరై వుంటారు?

వర్షం పడకుండా అడ్డుకట్టిన కాన్వాస్ గుడ్డను తొలగించుకుని దిగి నుంచున్న ఇందిరనూ, ఆమె రెండేళ్ళ కొడుకునూ చూసి వుప్పొంగిపోయింది భవాని.

ఒక్క వుదుటున లేచి బయటకు పరుగెత్తిందామె. ఓ చేత్తో పాపనెత్తుకొని, మరోచేత్తో బాబుని నడిపించు

కుంటూ లోపలికొస్తున్న ఇందిరని "నీకు నూరేళ్లాయిష్షు" అంటూ ఆనందంగా పలకరించింది భవాని

"ఎందుకనో ?"

"ఇప్పుడే నిన్ను తలుచుకొన్నాను- ఇంతలో రిక్షా దిగావ్ ! ఇంతకూ ఎప్పుడూ రావడం ?" అడిగింది భవాని

"మా అత్తగారి ఊరెళ్ళి వారమైంది అక్కడినుంచి నిన్ననే మా అమ్మా వాళ్ళింటికి వచ్చాను " నవ్వుతూ అంది ఇందిర

ఆమె చేతిలోని పాపనందుకుని ముద్దు పెట్టుకొంది భవాని తెల్లగా, బొద్దుగా ఎంతో ముద్దొస్తోంది పాప

"దీన్ని నేను వుంచేసుకుంటానే " పాపాయిని గుండెలకి హత్తుకుంటూ అంది భవాని

"దీన్ని చూస్తే ఇలాగే అంటావని నేను ముందే అనుకున్నాను " నవ్వుతూ అంది ఇందిర

ఇద్దరూ లోపలికి నడిచి కుర్చీల్లో కూర్చున్నారు

"నీ పెళ్ళెప్పుడే ? త్వరగా చేసుకుంటే నువ్వూ ఓ పాపనికనేయొచ్చుగా ?" అడిగింది ఇందిర మాటల్లో

"అవున్లే అదేదో సామెత చెప్పినట్లుంది " నవ్వేస్తూ అంది భవాని

పాప తల్లి చంకలోంచి ముందుకు వంగి బాబు చేతిలోవున్న బొమ్మ కావాలని మారాం మొదలుపెట్టింది

"నాకేం నేనివ్వను "బాబు పెంకిగా అన్నాడు

పాప ఏడుపు మొదలుపెట్టింది

"పాపాయి చిన్నదికదమ్మా ? ఆ బొమ్మ ఇచ్చేసెయ్ మనం ఇంకోటి కొనుక్కుందాం " లాలించి ఆ బొమ్మను తీసుకొని పాపాయి కిచ్చింది ఇందిర

"అన్నిటికీ పేచీయేనే ఇద్దరిలోనూ ! వాడికేదైనా కొనిస్తే ఇది గొడవ దీనికేదైనా కొనిస్తే వాడు గొడవ " నవ్వుతూ అందామె

"చిన్నప్పుడు ఎవరుమాత్రం పోట్లాడు కోరే " భవాని మామూలుగా అయితే అనేసింది కాని వెంటనే ఆమెకు తన చిన్నతనం టక్కున కళ్ళముందు కొచ్చేసింది

తనూ, అక్కయ్య రమణి ఇద్దరే పిల్లలూ తమ తల్లిదండ్రులకు కానీ తమాషా ఏమిటంటే తనెప్పుడూ అక్కయ్య వస్తువులు కావాలని గొడవ చేసేదికాదు వద్దని ఏడుస్తుండేది

దానికి కారణముంది

అయిదో క్లాస్‌వరకూ తనకు వూహ సరిగా తెలీదు

అంతవరకూ అక్కయ్యకు బిగుతైన బట్టలు తను వేసుకుంటూ వచ్చింది అక్కయ్యకి చిన్నవైన చెప్పులూ తనే వేసుకోవాలి అక్కయ్యకి కొత్తరిబ్బన్లు కొంటే తనకి అక్కయ్య వాడిన పాత రిబ్బన్లు వచ్చేవి

తని తల్లిదండ్రులలా చేయడానికి కారణం తనమీద ప్రేమ లేకా కాదు, అయిష్టమూకాదు, అక్కయ్యంటే ఏ పక్షపాతమూ లేదు కేవలం ఆర్థిక పరిస్థితులే అలాంటి పద్ధతులకు పురిగొల్పినయ్

అయిదో క్లాస్ పాసయింతర్వాత తను మొదటిసారిగా గొడవచేసింది ఆరో క్లాసులో మిగితా పిల్లలందరి లాగానే తనూ కొత్త పుస్తకాలు కొనుక్కోవాలని వువ్విళ్ళూరింది తీరా నాన్న అక్కయ్య పుస్తకాలే మళ్ళీ బైండ్ చేయించ తీసుకొచ్చేసరికి తనకి వుక్రోషం ముంచుకొచ్చింది

"నాకేం నాకు కొత్త పుస్తకాలు కావాలి ఈ పాతవి వద్దు " అంటూ మారాం చేసింది

తనకి బాగా గుర్తుందా రోజు

తల్లి తండ్రి బ్రతిమాలారు బుజ్జగించారు ఎన్ని చేసినా తనూరుకోలేదు ఆ రాత్రి అన్నం తినకుండా ఏడుస్తూ కూర్చుంది చివరికి విసిగిపోయిన తల్లి తనని చావుదెబ్బలు కొట్టింది ఆ తరువాత ఆమెకూడా ఏడ్చేసింది అంతగా కొట్టినందుకు

చివరికి రాజీ పడకా తప్పలేదు, ఆ పాత పుస్తకాలు చదవకా తప్పలేదు

ఆ సంవత్సరం దీపావళి పండక్కి మళ్ళీ—

అక్కయ్యకి కొత్తగౌను, తనకి అక్కయ్యకి బిగువైన పాతగౌను। అందరి పిల్లల్లాగానే కొత్తబట్టలు తొడుక్కోవాలన్న వుత్సాహం నీరు కారిపోయింది


ఆ రోజూ అంతే - ఏడుస్తూ కూర్చుంది పాతగౌను విసిరికొట్టింది

తల్లీ తండ్రీ తనని మామూలుగానే బ్రతిమాలారు ఆ గౌను కాస్త ఖరీదైనదీ, ఇంకా ఏమాత్రం చిరగనిదీ కావడంతో తనెంత గొడవచేసినా దాన్నే వేసుకొమ్మన్నారు ఆ రోజు రాత్రి తనకి అన్నంలేదు

ఆ తర్వాత మామూలే రాజీ పడిపోయింది పాతగౌనే వేసుకొని స్కూలు కెళ్ళింది

ఆ తర్వాత అవేకాదు ప్రతీ విషయంలోనూ — అక్కయ్య పావడాలూ లంగాలూ చీరలూ జడకుప్పెలూ, గాజులూ, అక్కయ్య పెళ్ళయ్యేవరకూ అన్నిటికీ తను రాజీ పడాల్సివచ్చింది కోరికలకు కళ్ళాలు వేయాల్సి వచ్చింది

అక్కయ్య అత్తగారింటి కెప్పుడెళ్ళిపోతుందా అని వేయికళ్ళతో ఎదురు చూసింది తను ఆమె వెళ్ళిపోతే ఇంట్లో తనొక్ఖర్తే అప్పుడు తనక్కావలసినవన్నీ కొత్తవే కొనుక్కోవచ్చు కొనగలిగే తాహతు లేకపోతే కొనకుండా వూరుకోవచ్చు అంతేగాని పాత వస్తువులకి రాజీ పడాల్సిన అవసరం ఇక వుండదు




రమణ అత్తగారింటికి వెళ్ళిపోయింది. తనెంతో వుత్సాహంగా ఎదురుచూసిన ఆ రోజు తనకెందుకో వుత్సాహాన్ని కలిగించలేదు. ఏదో తెలీని నిర్లిప్తత. తీరా ఆమె వెళ్ళిపోయాక కోరికలే లేకుండా పోయాయ్!

కొత్తబట్టలు, కొత్తగాజులు, కొత్త నవరం – అన్నీ కొత్తవే కొనుక్కోవాలన్న తన కోరిక, వుత్సాహం అంతు లేకుండా పోయాయ్.

ఆ వయసు వేరు, ఆ ముచ్చట్లు వేరు. ఆ వయసుకు తగ్గ ముచ్చట్లు ఆ వయసులోనే జరగాలి, ఈ వయసుకి తగ్గ ముచ్చట్లు ఈ వయసులో జరగాలి !

"ఏమిటీ! ఆలోచనలో పడ్డావ్?" కుదుపుతూ అడిగింది ఇందిర

చటుక్కున స్పృహలో కొచ్చింది భవాని. తన ఆలోచనలకి తనకే సిగ్గేసింది.

"అలా డాబామీదకి వెళ్ళి కూర్చుందాం. పద – వర్షం పూర్తిగా తగ్గిపోయిందిగా..." ఉత్సాహంగా అంది ఇందిర.

ఇద్దరూ డాబామీదకి చేరుకున్నారు.

చదువుకునే రోజుల్లో ఇద్దరూ ఎన్నో సాయంత్రాలు ఆ డాబామీద కబుర్లు చెప్పుకుంటూ గడిపారు.

తను అన్నీ అక్కయ్య వస్తువులే వాడేదని ఇందిర తనని 'సెకండ్‌హాండ్' అని ఏడిపిస్తుండేది.

సాయంత్రపు నీరెండ కాస్తోంది. ఓ పక్క రంగుల ఇంద్రధనస్సు...

"ఏమే సెకండ్‌హాండ్! ఏంటీ విశేషాలు?" అడిగింది ఇందిర నవ్వుతూ

భవానికూడా నవ్వొచ్చింది

ఇప్పుడు నేను సెకండ్‌హాండ్‌ని

కాదులేవే - అక్కయ్య వెళ్ళిపోయిం దిగా...."

"అవునే! మీ అమ్మానాన్నలకి నువ్వింకా చిన్నపిల్లవిలాగానే కనబడు తున్నావా ఏంటిఖర్మ - పెళ్ళెప్పుడు చేస్తారట?" అడిగింది ఇందిర.

"చూస్తూనే వున్నారే - కట్నాలకి తూగలేక...."

ఓహో...." అర్థమైందన్నట్లు తలెగ రేసింది ఇందిర.

"పోనీ ఎవరైనా ప్రేమించి పెళ్ళి చేసుకోలేకపోయావా?" నవ్వుతూ మళ్ళీ తనే అడిగింది.

భవాని వులిక్కిపడింది.

"ఏమే! ఈ మాటలు వూరికే అన్నావా? లేకపోతే నా గురించి ఎవ రైనా, ఏమైనా చెప్పారా?" చకితురాలై అడిగింది భవాని.

"అంటే.... నిజంగానే ఏమయినా గొడవుందా ఏంటి?" నవ్వేస్తూ అంది ఇందిర.

భవానీ నవ్వింది.

"నీతో ఓ విషయం చెప్పాలే...." తటపటాయిస్తూ అంది.

"ఏమిటి?"

"ఓ చిన్న ప్రేమకథ...."

"ప్రేమకథా! ఎవరిది?"

"నాదే ...." సిగ్గుపడిపోయింది భవాని.

"అమ్మదొంగా! ఇంతసేపూ నా దగ్గరే దాచేవన్నమాట! ఎవరతను?"

"అదిగో ఆ డాబాలేదూ - అందులో అద్దెకి దిగారు ఈమధ్యే...."

ఎదురింటి అబ్బాయన్న మాట! బావుంది. ఏమైనా వుద్యోగం చేస్తు న్నాడా?"

"స్టెనోగా వర్క్ చేస్తున్నాడు."

"ఇద్దరికీ ఎలా కలిసింది?"

ప్రతీరోజూ సాయంత్రం పూట డాబా మీద కాసేపు కూర్చోవడం అలవాటై పోయిందికదా - అతనూ అదే సమయా నికి వాళ్ళ డాబామీద కనిపించడం మొదలుపెట్టాడు. ఓ రోజు నేను బస్ స్టాప్‌లో నిలబడితే అతనే పలుక రించాడు. అంతే! అది చాలా దూరం వచ్చేసింది."

"మరయితే పెళ్ళెప్పుడు?"

"అక్కడే వచ్చిపడింది గొడవ...."

"అదేం?"

"మామూలు అన్ని మధ్యతరగతి కుటుంబాలకుండే సమస్యలన్నీ అతనికీ వున్నాయ్ - పెళ్ళికాని చెల్లెళ్ళు, కట్నా లివ్వలేని ఆర్థిక పరిస్థితులు వగైరా వగైరా."

"మరేం నిర్ణయించుకున్నారు?"

"పరిష్కారం ఇద్దరివల్లా కాక అలా గాలికొదిలేశాం ప్రస్తుతానికి."

"బావుంది." నిట్టూరుస్తూ అంది ఇందిర.

మరికాసేపు కూర్చుని బయల్దేరింది ఇందిర ఆమెతోపాటు బయటివరకూ వచ్చింది భవాని

"ఇంక వెళ్తా నే-నీ పెళ్ళికి పిలవడం మరచిపోవుకదా " పరిహాసంగా అందామె

"బావుంది పెళ్ళి పెద్దవే నువ్వైతే మరచిపోవడమా?"

ఇందిర వెళ్ళిపోయింది

వెళ్ళిన రెండు నెలలకే ఆమెకు భవాని పెళ్ళిశుభలేక అందింది

* * *

"పాడు వర్షం మీ అక్కయ్య పెళ్ళికీ ఇలాగే కురిసింది" చిరాగ్గా అంది శాంతమ్మ

భవాని కిటికీ దగ్గర కూర్చుని బయట ఉదయంనించీ ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న వర్షాన్ని చూస్తోంది వీధంతా వాననీటితో నిండిపోయింది వర్షం మూలాన వివాహానికెక్కువమంది బంధువులు రాలేదు వచ్చినవాళ్ళలో చాలా మంది సూత్రధారణ అయిపోగానే వెళ్ళిపోయారు

భవాని అలా చూస్తుండగానే చీకటి పడిపోయింది

అక్కయ్య పిల్లలు, ఇంకా మిగతా బంధువుల పిల్లలు ఆడుకుంటున్నారు కాబోలు ఇల్లంతా ఒకటే హడావిడిగా వుంది

"భవానీ! ఇంకా అలానే కూర్చు



న్నావా! ఇది మొదటిరాత్రి అన్న సంగతి మరచిపోయావా ఏంటి ఖర్మ ఇలా రా . జడవేస్తాను," పిన్ని వచ్చి ఆమెని చెయ్యిపట్టుకు లాక్కుపోయింది

మరికొద్దిసేపట్లో ఆమె అలంకరణ పూర్తైంది

"పిన్నీ! ఎక్కడికెళ్తున్నావ్? సిని మాకా?" భవానున్న గదిలోకొచ్చి అడిగాడు అక్క మూడేళ్ళ కొడుకు.

"కాదురా! ఎక్కడికీ వెళ్ళడంలేదు." జీవంలేని నవ్వుతో వాడిని దగ్గరకు తీసుకొంది భవాని.

ఆమె చేతుల్ని సున్నితంగా విడి పించుకుని వాడు మళ్ళీ మిగతా పిల్లలతో ఆడుకోవడానికి తుఱ్ఱుమన్నాడు.

టైమ్ గడిచిపోతోంది. అంత చీక ట్లోనూ వర్షం పడడం కనబడుతూనే వుంది భవానికి. ఆమెకు తెలీకుండానే కళ్ళ వెంట నీళ్ళు ధారగా కారి పోతున్నాయ్. అలా ఎంతసేపు గడిచి పోయిందోకూడా తెలీదు.

"పద...." అంటూ ఒకరు ఆమెని శోభనపు గదిలోకి తీసుకెళ్ళారు.

తలుపులు మూసుకుపోయినయ్.

అక్కయ్య శోభనంకూడా ఈ గది లోనే జరిగింది.

అంచేత తనకూ ఇదేగది!

"రా భవానీ! ఇలావచ్చి కూర్చో...." ఆమె భుజంమీద చెయ్యివేసి అన్నాడు రాజారావు.

మంచంమీద అతని పక్కనే కూర్చుండిపోయింది భవాని.

ఆమెను దగ్గరకు లాక్కొని పెదాల మీద ముద్దు పెట్టుకున్నాడతను.

భవానిలో ఆ చర్య ఎలాంటి చల నాన్నీ కలిగించలేదు.

"అలా వున్నావేం భవానీ! చేసుకున్న పెళ్ళికి పశ్చాత్తాప పడడంలేదు కదా? నిజానికి అసలు ఈ వివాహం నాకూ ఇష్టలేదు భవానీ! కానీ పిల్లలకోసం - అదీ నువ్వైతేనే వాళ్ళ ఆలనా పాలనా బావుంటుందని మీ వాళ్ళు బలవంతం చేసేసరికి...."

"లేదు బావా! లేదు...." తడబడింది భవాని.


'పశ్చాత్తాపపడ్డా లాభమేముంది బావా! అక్కయ్య కోసం ఏర్పరచిన వస్తువులే నాకు దక్కాలని దేవుడు నా నుదుట రాశాడు. ఆఖరికి భర్తకూడా అక్క భర్తే! అందుకేనేమో అక్కయ్యని ఆయుష్షు తీరకుండా తీసుకెళ్ళిపోయాడు.' అనాలనుకున్న మాటలు పెదాలు దాటి బయటికి రాకుండానే ఆగిపోయాయ్ భవానికి.

"నీకో విషయం చెప్పాలి భవానీ..."

తలెత్తి అతనివంక చూసింది.

"చెప్పు బావా..."

"నీకే విధమైన లోటూ చేయను భవానీ! మీ అక్కయ్యనెంతో అపు రూపంగా చూసుకున్నాను. ఎన్నో విలు వైన వస్తువులు కొన్నాను. అవన్నీ ఇప్పుడు నీవే. కానీ ఒకే ఒక్క విషయంలో నీ కన్యాయం చేశాను భవానీ. అదీ కావాలని చెయ్యలేదు. మీ అమ్మా




నాన్నగార్ల కోరిక మీదే దాచాను విషయం ”

భవాని వూపిరి బిగపట్టి వినసాగింది

“ఇద్దరు పిల్లలు పుట్టగానే నేను ఆపరేషన్ చేయించుకున్నాను భవానీ! ఇంతలోనే ఇంత ఘోరం జరిగిపోతుందని ఏనాడూ వూహించలేదు ఇంక ఆ పిల్లలే నీ పిల్లలు ప్రతి స్త్రీ మాతృత్వాన్ని కోరుకుంటుందనీ, తను కన్న ఎల్లల్ని పెంచాలన్న మమకారం ఆమెకుంటుందనీ ”

భవాని నిశ్చేష్టురాలై పోయింది గాని వెంటనే తేరుకుంది

“ఫరవాలేదు బావా! నేనేం బాధ పడడంలేదు జీవితంతో రాజీపడడం చిన్నప్పుడే నేర్చుకున్నాను చిన్నప్పటి నుంచీ అంతే బావా - అక్కయ్యకి సంబంధించిన వస్తువులన్నింటికీ నేనే వారసురాల్ని ఆఖరికి ఇప్పుడు అక్కయ్య భర్త, పిల్లలకి కూడా!” ఆమె దుఃఖం ఆగలేదు

అతని కౌగిట్లో కరిగిపోయి ఉప్పెనలా ఏడ్చేయసాగింది

———